క్లుప్తంగా

అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు



వీఆర్వోల సమావేశంలో సూచనలిస్తున్న తహసీల్దార్ శ్రీను

బొబ్బిలి రూరల్: ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోకుండా గ్రామాల్లో దీపావళి బాణసంచాను విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ఎం.శ్రీను హెచ్చరించారు. తన కార్యాలయంలో వీఆర్వోలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ అనుమతులు తీసుకున్న వారు సైతం ప్రభుత్వం నిర్దేశించిన షరతుల ప్రకారం అన్నీ ముందస్తు జాగ్రత్తలను తీసుకున్న తరువాతే విక్రయాలు జరపాలని, అనుమతులు లేకుండా విక్రయించే వారిపై కేసులు నమోదు చేయాలని వీఆర్వోలకు సూచించారు. సమావేశంలో ఆర్ఐ రామకుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

మురుగు కాలువల పరిశీలన



లచ్చయ్యపేట శివారు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

రాజాం: పట్టణంలోని లచ్చయ్యపేట, మల్లిఖార్జునకాలనీ, మారుతీనగర్ ప్రాంతాల్లో మురుగు కాలువలను మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో డ్రైనేజీ లేని ప్రాంతాలను గుర్తించి ఏఈలతో ప్రతిపాదనలు చేయించారు. మున్సిపాల్టీలో అన్ని వార్డుల్లో మురుగు కాలువల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఈ సందర్భంగా వెల్లడించారు.

కొండచిలువ హతం



రైతులు హతమార్చిన కొండచిలువ

రేగిడి: మండల పరిధిలోని వండానపేట గ్రామంలో శుక్రవారం కొండచిలువ హల్‌చల్ చేసింది. తెల్లవారి పొలం పరిశీలనకు వెళ్లిన రైతులకు ఏదో శబ్దం రావడంతో పరిశీలించారు. పొలంలో అటూ ఇటూ కదులుతున్న కొండచిలువను చూసి దగ్గర్లో ఉన్న వారిని పిలిచారు. సుమారు 10 అడుగులు ఉన్న కొండచిలువను చూసిన వారంతా భయాందోళనకు గురయ్యారు. రైతులు దాన్ని హతమార్చారు.

అరుదైన చేప లభ్యం



మత్స్యకారుడు వలకు చిక్కిన చేప

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు దిగువ వంతెన సమీపంలో అరుదైన చేప మత్స్యకారుల వలకు చిక్కింది. మడ్డువలస గేట్లు మూసివేయడంతో బకెట్ పోర్షన్ నుంచి వంతెన వరకు మత్స్యకారులు వలలు వేసి చేపలు వేట సాగించారు. ఈ క్రమంలో ఓలుగు రకానికి చెందిన 10 కేజీల బరువు గల చేప మత్స్యకారుల వలకు చిక్కింది. దీంతో ఆ మత్స్యకారుడు సంబరపడ్డాడు. ఆ చేపను విక్రయించగా సుమారు రూ.4వేలు రావడంతో సంతోషపడ్డాడు.

సీఆర్‌పీలకు శిక్షణ

రాజాం : మండలంలోని సోపేరు గ్రామంలో పలు గ్రామాలకు చెందిన సీఆర్‌పీలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీవో జె.ఆనందరావు ఆధ్వర్యంలో జరిగిన శిక్షణలో సీఆర్‌పీలు గ్రామాల పరిశుభ్రత నిమిత్తం తీసుకోవల్సిన అంశాలు వివరించారు. చెత్త సేకరణపై మహిళలకు అవగాహన కల్పించడంతో పాటు ప్రతీ రోజు 50 మంది ద్వారా చెత్తను క్లాప్‌మిత్రలకు అందించడం, అలా వెయ్యి కుటుంబాలను తమ పరిధిలోకి తీసుకుని చెత్త సేకరణలో క్లాప్ మిత్రలకు సహకరించేలా మహిళలకు సాయం చేయాలని వెల్లడించారు. డీపీఆర్‌సీ రిసోర్సుపర్సన్ సుప్రియ ఈ సందర్భంగా పలు అంశాలు వివరించారు. డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

బాడంగి: ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి క్లాప్ మిత్రలకు ఇచ్చే విధంగా వారికి అవగాహన కల్పించాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సీఆర్‌పీలకు సూచించారు. మండలంలోని కోటిపల్లిలో ఎల్‌టీసీ కేంద్రం వద్ద బొబ్బిలి, బాడంగి సీఆర్‌పీలకు ఒక రోజు శిక్షణ శుక్రవారం నిర్వహించారు. శిక్షణలో డిప్యూటీ ఎంపీడీవో దేవకుమార్, ఆర్‌పీలు తమ్మిరెడ్డి వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి కెంగువ రమేష్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

వాహనాలను అప్పగించండి

బొబ్బిలి: కరోనా సమయంలో సీజ్ చేసిన బైక్‌లను ఆయా యజమానులకు అప్పగించాలని డీహెచ్‌పీఎస్ బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జి గర్బాపు రమేష్ కోరారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వేలాది వాహనాలను సీజ్ చేయగా వాటిని వివిధ పోలీసు, ఎక్సైజ్ స్టేషన్లలో భద్రపరిచారన్నారు. యజమానులకు అప్పగించకపోవడంతో పాడైపోతున్నాయన్నారు.

వరికి మూషికాలతో ముప్పు

- పొట్ట దశలో పైరు
- పంటలను దెబ్బతీస్తున్న ఎలుకలు
- ఏటా ఖరీఫ్‌లో తీవ్ర నష్టం



రామభద్రపురంలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

రామభద్రపురం: ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తున్న అన్నదాతకు కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరిపైరును ఓ వైపు చీడపీడలు, తెగుళ్లు ఆశిస్తుండగా మరో వైపు మూషికాలు అన్నదాతను ముప్పతిప్పలు పెడుతున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ వరి పంట పొట్ట దశకు చేరుకుంటున్న తరుణంలో తీపిగా ఉండే దుబ్బు, పిలకలను మూషికాలు తినివేస్తూ దిగుబడిపై ప్రభావం చూపుతున్నాయి. జిల్లాలో 97 వేల హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారు. సకాలంలో వర్షాలు పడిన ప్రాంతాలలో జూలై, వర్షాభావ పరిస్థితులు ఉన్న ప్రాంతాలలో ఆగస్టు చివరి నాటికి ఉబాలు పూర్తి చేశారు. రైతులు పంటలకు వేసిన ఎరువులు కారణంగా వరి పైరు వేగంగా పెరిగి కొన్ని చోట్ల దుబ్బు కట్టే దశకు చేరుకోగా మరి కొన్నిచోట్ల పొట్ట దశకు చేరుకున్నాయి. పిలకలు, పొట్ట తీపిగా ఉండడంతో ఎలుకలు వాటిని కొరికి గట్టు కన్నాల్లోకి తీసుకెళుతున్నాయి. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలోని ఎలుకలను నివారించే వ్యవస్థ లేకపోవడంతో రైతులకు ఏటా నష్టాలు తప్పడం లేదు. సామూహికంగా నివారించేందుకు ప్రభుత్వం ఎలుకల పట్టే బుట్టలుగాని, బ్రోమోడయోలిన్ మందును గానీ వ్యవసాయ శాఖ ద్వారా పంపిణీ చేయాలి. దీనికి సంబంధించి నేటికీ జిల్లాలో ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

నివారణకు ఏం చేయాలి..

గ్రామంలో రైతులంతా ఓ యూనిట్‌గా ఏర్పడి సామూహిక ఎలుకల నివారణకు చర్యలు చేపట్టాలి. సామూహిక ఎలుకల నివారణకు బ్రోమోడాయోలిన్ 0.25 మి.లీ. ఎలుకల మందును రెండు శాతం విషపు ఎరగా తయారు చేసుకోవడం కోసం 96 పాళ్ల నూకలు, రెండు గ్రాముల నూనె కలపాలి. ఒక్కో సజీవ ఎలుక కన్నానికి 10 గ్రాముల ఎరను కాగితంలో పొట్లంగా చుట్టి ఎలుక కన్నంలో పెట్టాలి. కలిపిన ఎర మందు 12 గంటలు దాటితే ఆ వాసనను ఎలుకలు పసిగడతాయి. కాబట్టే ఈ మిశ్రమాన్ని మధ్యాహ్నం కలిపి సాయంత్రంలోపు అమర్చాలి. మందు తిన్న నాలుగు నుంచి ఐదు రోజులకు ఎలుక చనిపోతుంది. ఈ మందు తిన్న ఎలుకల రక్తం గడ్డ కట్టదు. అవి రక్తస్రావమై రక్తహీనతతో చనిపోతాయి.

పొగ పెట్టాలి...

పొగబారించే యంత్రం (బర్రోఫ్యూమి గేటర్)తో ఎలుకల కన్నాలను కప్పి రెండు నుంచి మూడు నిమిషాల పొగ పెడితే వాటిలో ఉంటే తల్లి, పిల్ల ఎలుకలు పూర్తిగా చనిపోతాయి. ఎలుక కన్నాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ పొగ పెట్టడం మంచిది.

రైతులు దృష్టి పెట్టాలి..



రైతులు యాజమాన్య పద్ధతుల్లో భాగంగా ఎలుకలను నివారించుకోవాలి. మూషికాలతో పంటలకు తీవ్ర నష్టం జరుగుతోంది. వరి దుబ్బులు తీపిగా ఉండడంతో పొట్ట దశలోనే ఎలుకలు వీటిని కొరికి రైతులకు నష్టం కలిగిస్తాయి. రైతులు దీనిపై దృష్టి సారించి సామూహికంగా ఎలుకలను నిర్మూలించేందుకు ముందుకు రావాలి. విషపు ఎరలు పెట్టడంతో పాటు ట్రాప్‌లు పొగబారించే పద్ధతులు అవలంభించాలి.

– ఎం.శివ, ఏవో, రామభద్రపురం

బినామీల కోసమే మెడికల్ కళాశాలలపై బాబు కుట్ర



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

- ఆయన స్వార్థానికి పేదలకు వైద్య విద్య దూరం
- పేదలకు విద్య, వైద్యం జగనన్నకే సాధ్యం
- వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

రామభద్రపురం: పేదలకు వైద్యం అందకుండా బినామీల కోసమే మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేసేందుకు చంద్రబాబు కుట్ర పన్నుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ధ్వజమెత్తారు. మండల పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలకు విద్య, వైద్యం అందించడం మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమన్నారు. పేద విద్యార్థులు చదువుకునేందుకు 17 మెడికల్ కాలేజీలు నిర్మాణం చేపడితే ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు వాటిని ప్రైవేటుపరం చేసి కార్పొరేట్‌కు దాసోహం చేసిందని మండిపడ్డారు. చంద్రబాబు స్వార్థానికి పేదలకు వైద్య విద్య దూరం చేస్తూ ప్రైవేటు వ్యక్తులకిచ్చి నిర్వీర్యం చేయడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. ప్రజా వైద్యాన్ని ప్రైవేటీకరించే విధానాలను కూటమి ప్రభుత్వం విరమించుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. ప్రజా వైద్యం ప్రజలకే చెందాలన్న ఉద్దేశంతో జగనన్న చేపట్టిన కోటి సంతకాల సేకరణలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.

గిరిజన విద్యార్థులకు అన్యాయం జరిగితే సహించేది లేదు

గిరిజన ఆశ్రమ, ఏకలవ్య, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు అన్యాయం జరిగితే సహించేది లేదని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థుల మరణం, వందల మంది విద్యార్థులు ఆస్పత్రి పాలైతే కూటమి ప్రభుత్వ పాలకులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. ఈ సంఘటనలు కూటమి ప్రభుత్వ పాలనలో పాఠశాలల్లో నెలకొన్న దారుణ పరిస్థితులకు అద్దం పడుతున్నాయని విమర్శించారు. బాధిత విద్యార్థులను పరామర్శించడంతో పాటు మృతుల కుటుంబాలకు పార్టీ తరఫున రూ.5 లక్షలు చొప్పున్న ఆర్థిక సాయం అందజేశామని, కూటమి ప్రభుత్వం ఒక్కొక్కరికీ రూ.25 లక్షలు చొప్పున్న ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్, పార్టీ యూత్ నాయకులు చొక్కాపు రామ్‌సందీప్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఎంపీడీవో



అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఎంపీడీవో

తెర్లాం: మండల కేంద్రమైన తెర్లాంలోని ఐదో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో రేగి రాంబాబు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రీస్కూల్ పిల్లల, అంగన్‌వాడీ కార్యకర్త, హెల్పర్ల హాజరును, రికార్డులను పరిశీలించారు. ప్రీస్కూల్ పిల్లలకు ఏ విధంగా విద్యా బోధన చేస్తున్నారని కార్యకర్త వై.శ్రీదేవిని అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న సేవల గురించి, పౌష్టికాహార పంపిణీ, ప్రీస్కూల్ పిల్లలకు తయారు చేసిన పౌష్టికాహారాన్ని ఆయన తనిఖీ చేశారు. మాజీ ఎంపీపీ నర్సుపల్లి వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ బోనెల రూప, ఎంపీటీసీ గొండేల ఆనందరావు, వైద్య అధికారులు, సిబ్బంది తదితరులు అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన వారిలో ఉన్నారు.

ఉపాధి పనులకు ప్రణాళిక

బాడంగి: ఉపాధి హామీ పథకం పనులను ప్రణాళిక పరంగా గుర్తించి మండలంలోని డొంకినవలస పంచాయతీకి చెందిన పనులను గ్రామస్తులకు శుక్రవారం వివరించామని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ తెలిపారు. 2026 – 27 సంవత్సరానికిగాను 209 యాక్టివ్ జాబ్ కార్డుదారులకు రూ.69 లక్షల 71 వేల 571 విలువైన పనులను అవసరంగా అంచనా వేసినట్టు చెప్పారు. 13 వేల 625 పనిదినాలు అవసరమైనందున అందుకు తగినట్టు పనులు గుర్తించి వేతనదారులకు పనులు కల్పించేందుకు తగిన ప్రణాళికలు తయారు చేయాలని సూచించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బంకురు సింహాచలం, కార్యదర్శి, ఉపాధి పీవో సాయిరాం, టెక్నికల్, ఫీల్డ్ సహాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి చేసిన న్యాయవాదిని అరెస్టు చేయాలి

తెర్లాం: సుప్రీంకోర్టు సీజేఐ గవాయిపై దాడికి ప్రయత్నించిన న్యాయవాదిని వెంటనే అరెస్టు చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కిల్లాడ సురేంద్రబాబు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద సీజేఐపై దాడిని నిరసిస్తూ గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజేఐపై న్యాయవాది దాడి విచారకరమని, ఇది ప్రతి ఒక్కరూ ఖండించాలని అన్నారు. దాడికి పాల్పడిన న్యాయవాది న్యాయ పట్టాను రద్దు చేయాలని అన్నారు. అనంతరం తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు రోహిత్, గోపి, నాగేశ్వరరావు, రవి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ల, నియోజకవర్గం నాయకులు రోహిత్, గోపి, నాగేశ్వరరావు, రవి, వరప్రసాద్ ఉన్నారు.

యువతకు ఆధ్యాత్మిక మార్గం అవసరం

బొబ్బిలి: నేటి యువతకు పోటీ పరీక్షలు, ఇతర ఒత్తిడులతో పాటు వ్యసనాల బారిన పడకుండా ఉండేందుకు ధ్యానంతో కూడిన ఆధ్యాత్మిక మార్గం అవసరమని జిల్లా కేంద్రంలోని బ్రహ్మకుమారీస్ శాఖ ముఖ్య వక్త లత అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు కళాశాలల్లో సకారాత్మక ఆలోచనలు పొందడం ఎలా అన్న అంశంపై అవగాహన కల్పించారు. కొన్ని ఉదాహరణలతో వ్యసన విముక్తి, అర్థవంతమయిన జీవితం గూర్చి వివరించారు. కార్యక్రమంలో రాజయోగిని రాజేశ్వరి అక్కయ్య ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రదర్శించారు. ఆయా కళాశాలల అధ్యాపక బృందాలు పాల్గొన్నాయి.

ఈపీఎఫ్ చందాదారులకు మోదీ ప్రభుత్వం ద్రోహం

బొబ్బిలి: కేంద్ర ప్రభుత్వం 20 కోట్ల మంది ఈపీఎఫ్ చందాదారులకు ద్రోహం చేయడానికి సీబీటీ (సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్ట్)సమావేశం తీర్మానించడం దారుణమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పొట్నూరు శంకరరావు ఆరోపించారు. శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఈపీఎఫ్ చందాదారులు, పెన్షన్ దారులకు కనీస పెన్షన్‌ను రూ.వెయ్యి నుంచి 2,500కు పెంచేందుకు గత సమావేశంలోనే నిర్ణయం తీసుకున్నారన్నారు. అయినప్పటికీ దానిని పట్టించుకోకుండా రూ.25 లక్షల కోట్ల ఈపీఎఫ్ నిధుల నిల్వలను షేర్ మార్కెట్‌లో పెట్టేందుకు ఉన్న పరిమితిని ఎత్తివేస్తూ ఈ నెల 13న జరిగిన సీబీటీ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. అలాగే కార్మికుల జీవిత చరమాంకంలో ప్రయోజనకరంగా ఉండేందుకు కార్మికుడి వాటాను విత్‌డ్రా చేసుకునేందుకు అవసరాలను ఎత్తివేస్తూ ఎప్పుడు పడితే అప్పుడు పూర్తిగా తీసుకోవచ్చని నిర్ణయం తీసుకోవడం కార్మికుల జీవితాలను నీరుగార్చడమేనన్నారు. ఇటువంటి నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని కోరుతూ వచ్చే నెల 11న ధర్నాలు, ర్యాలీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈపీఎఫ్ నాయకులు శేషగిరి రావు, టీవీ రమణ, టీబీ అప్పారావు, పి రమేష్, బంగారి యుగంధర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలి



మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై కోటి సంతకాల పోస్టర్ విడుదల చేసిన మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

మెంటాడ: గ్రామ స్థాయిలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు రాయిపల్లి రామారావు అధ్యక్షతన చింతలవలసలో పార్టీ కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ గ్రామాల్లో కమిటీలను వేయాలన్నారు. కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందన్నారు. జగనన్న పాలనలో 17 మెడికల్ కళాశాలలు మంజూరై ఐదు మెడికల్ కళాశాలలు ప్రారంభం కాగా... మిగిలిన వాటిని కూటమి సర్కార్ అభివృద్ధి చేయకుండా ప్రైవేటు పరం చేయాలని చూస్తుందన్నారు. పేదలకు విద్య, వైద్యం జగనన్నతోనే సాధ్యమన్నారు. కూటమి పాలకులు కార్పొరేట్ శక్తులకు అండగా ఉంటూ ప్రైవేటీకరణ వైపు అడుగులు వేస్తున్నారని దుయ్యబట్టారు. మద్యం స్కాంపై అనుకూల అధికారులతో సిట్ వేసి పబ్బం గడుపుతున్నారన్నారు. మద్యం స్కాంను ప్రతిపక్షంపై నెట్టేయడానికి కూటమి ప్రభుత్వం చూస్తుందన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఇలాఖాలో గిరిజన విద్యార్థుల మరణాలు కొనసాగుతుంటే చోద్యం చూస్తున్నారని ధ్వజమెత్తారు. తగిన సమయంలో ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. అంతకు ముందు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, బాయి అప్పారావు, రాజప్పలనాయుడు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

బాణసంచా అక్రమ విక్రయాలపై చర్యలు తప్పవు

బాడంగి: దీపావళి పండగ నేపథ్యంలో బాణసంచా విక్రయాలను అక్రమంగా జరిపితే చర్యలు తప్పవని బొబ్బిలి సీఐ నారాయణరావు హెచ్చరించారు. మండలంలోని గూడెపువలస పంచాయతీ మధుర గ్రామమైన రావివలసలో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. రావివలసలో ఎరుకుల కులస్తులు బాణసంచా తయారీ చేస్తున్నట్టు అందిన సమాచారంతో తనిఖీలు చేపట్టారు. బాణసంచా ఎక్కడా లభ్యం కాలేదు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...



తెర్లాం: నియోజకవర్గ స్థాయి పోటీల్లో ఎంపిక కోసం హోరాహోరీగా కబడ్డీ ఆడుతున్న బాలురు



బొబ్బిలి రూరల్: వాలీబాల్ ఆడుతున్న విద్యార్థినులు

తెర్లాం: తెర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలు శుక్రవారం ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను ఎంపీడీవో రేగి రాంబాబు, జెడ్పీటీసీ ప్రతినిధి రామారావు, మాజీ ఎంపీపీ ప్రతినిధి వెంకటేశ్వరరావు, తెర్లాం సర్పంచ్ రూప, ఎంపీటీసీ ఆనందరావు, ఎంఈవోలు త్రినాధరావు, పాపారావు, హెచ్ఎం రమేష్ ప్రారంభించారు. మండలంలోని 11 హైస్కూళ్లు, మూడు యూపీ స్కూళ్లు, ఆదర్శ పాఠశాల, కేజీబీవీ పాఠశాల నుంచి 330 మంది విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు. పోటీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ పోటీలను బాల బాలికలకు విడివిడిగా నిర్వహించారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

మండల స్థాయి ఆటల పోటీలు

బొబ్బిలి రూరల్: కలవరాయి వద్దనున్న మహాత్మ జ్యోతిబాపులే గురుకుల పాఠశాల ఆవరణలో మండలంలోని 20 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 180 మంది క్రీడాకారులకు క్రీడా పోటీలను శుక్రవారం నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను ఎంఈవో గొట్టాపు వాసు ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని గుర్తించేందుకు క్రీడలు దోహదపడతాయని ఆయన అన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఇలాంటి వేదికలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్ పోటీలు నిర్వహించగా ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను గుర్తించి డివిజన్ స్థాయి పోటీలకు పంపుతామని ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా పాఠశాలల పీడీలు పాల్గొన్నారు.

మెంటాడలో..

మెంటాడ: మండలంలోని ఆంధ్ర జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యాన్ని ఇస్తాయన్నారు. మండల క్రీడా కో ఆర్డినేటర్ జి.సత్యవతి, ఎంపీడీవో భానుమూర్తి, డిప్యూటీ ఈవో మోహనరావు, ఎంఈవో వర్మ, జెడ్పీటీసీ ప్రతినిధి లెంక రత్నాకర్‌నాయుడు, విద్యాకమిటీ చైర్మన్ దాసరి అప్పలరాజు, ఎంపీటీసీ అప్పలనరసమ్మ తదితరులు పాల్గొన్నారు. పోటీల్లో ఎనిమిది పాఠశాలల నుంచి విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

పీహెచ్‌సీ వైద్యుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మూర్తినాయుడు

రాజాం సిటీ: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించే పీహెచ్‌సీ వైద్యుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఆశ వర్కర్ల యూనియన్ గౌరవాధ్యక్షుడు సీహెచ్ రామ్మూర్తినాయుడు అన్నారు. శుక్రవారం రాజాంలో జరిగిన ఆశ వర్కర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనేక సమస్యలు ఎదుర్కొంటున్న వైద్యులను చర్చల పేరుతో కాలయాపన చేయడం సరైంది కాదన్నారు. యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సూర్యమణి, పార్వతి, ఆశ వర్కర్లు రమణమ్మ, రాణి, చిన్నమ్మడు, గౌరమ్మ, ఇందిర, నిర్మల, జయలక్ష్మి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్

సంతకవిటి: రాజాం–సంతకవిటి ప్రధాన రహదారిలో రహదారికి ఇరువైపులా జంగిల్ పేరుకుపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురౌతున్నారు. అధికారులు గురువారం రాజాం – గుళ్లసీతారాంపురం గ్రామాల మధ్య జేసీబీతో జంగిల్ తొలగింపు పనులను ప్రారంభించారు. దీంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సంతకవిటి సెక్షన్‌లో రూ.9.87 లక్షలతో రోడ్లు నిర్వహణ, జంగిల్ కియరెన్స్ పనులు చేపడుతున్నట్టు ఆర్‌అండ్‌బి ఏఈఈ సతీష్ తెలిపారు.

తడి పొడి చెత్త సేకరణపై శిక్షణ

రాజాం సిటీ: గ్రామాల్లో ఇంటింటి నుంచి తడి పొడి చెత్తను వేరువేరుగా సేకరించి క్లాప్ మిత్రలకు అందేలా చూడాలని ఎంపీఈవో జె.ఆనందరావు అన్నారు. మండల పరిధి సోపేరులో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు చెందిన 50 మంది మహిళా సీఆర్‌పీలకు శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కొక్క సీఆర్‌పీ వెయ్యి కుటుంబాలను రోజుకు 50 కుటుంబాలు చొప్పున సర్వే చేసి తడి పొడి చెత్తపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరికి పారితోషకం రూ.5వేలు అందించనున్నామని పేర్కొన్నారు. డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, డీపీఆర్‌సీ రిసోర్స్‌పర్సన్ సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే..



సంతకవిటి: గుళ్లసీతారాంపురంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న మురుగు

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురం గ్రామంలో ప్రధాన రహదారి పక్కనే మురుగు దర్శనమిస్తుంది. దీనితో అటుగా ప్రయాణించే వారు ముక్కుమూసుకోవాల్సిందే. గ్రామంలో ఇలా మురుగు దర్శనమిస్తుంటే అధికారులు మాత్రం పట్టడం లేదు. మురుగు కారణంగా దోమలు అధికంగా ఉన్నాయని, దోమల కారణంగా అనారోగ్యం బారిన పడే ప్రమాదం అధికంగా ఉందని, అధికారులు స్పందించి మురుగును తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలు

రాజాం సిటీ: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంతో ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని వికాస తరంగిణి సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి టీటీవీ రమణమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలను వివరించారు. ప్రతి ఒక్కరు ఆయా కుటుంబాలలో ఈ విషయాలు తెలియజేసి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు తమ వంతు కృషి చేయాలని కోరారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.రామారావు, వికాస తరంగిణి అధ్యక్షులు వి.పైడిరాజు, అధ్యాపకులు బి.చంద్రశేఖర్, మానస కుమారి, వెంకటలక్ష్మి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మాలధారణ

రాజాం సిటీ: మండల పరిధి కంచరాం గ్రామంలోని పూర్ణ పుష్కలాంబ సమేత హరిహరసుత అయ్యప్పస్వామి దేవాలయంలో శుక్రవారం ఘనంగా అయ్యప్ప మాలధారణ కార్యక్రమం నిర్వహించారు. కంచరాంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన 108 మంది భక్తులకు టంకాల పాపినాయుడు గురుస్వామి మాలధారణ చేశారు. ఆలయంలో ప్రతి రోజు 41 రోజులుపాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నామని తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

సంతకవిటి: మండలంలోని మండాకురిటి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్ 14 విభాగంలో ఎం.నోసియ, అండర్ 17 విభాగంలో పోతురాజు మేఘన రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు, ఎ.సాయిభార్గవి, పి.నాని, బి.ధనలక్ష్మి రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం ఎం.రమణమ్మ శుక్రవారం తెలిపారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన జిల్లా స్థాయి క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు తెలిపారు. ఈ విద్యార్థులను శుక్రవారం అభినందించారు.

బోధనలో మెలకువలు పాటించాలి

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బోధనలో మెలకువలు పాటించాలని ఎంఈవోలు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్య సూచించారు. మండల పరిధిలోని బూరాడ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అభ్యసనా సామర్థ్యాల్లో వెనుకబడిన విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్ కిట్లు ఉపయోగించి బోధన అభ్యసనా ప్రక్రియ సాగించాలన్నారు. కార్యక్రమంలో ప్యానల్ సిబ్బంది వైకుంఠరావు, ఎందువ సీతంనాయుడు, సాదెం తిరుపతి రావు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ కెంబూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్వాసకోశ పునర్జీవనంపై అవగాహన

రేగిడి: హృదయ శ్వాసకోశ పునర్జీవనంపై మండల పరిధిలోని ఖండ్యాం ఆయుష్ వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ విద్యార్థులకు శుక్రవారం ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పించారు. ఎవరైనా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలిగిన, హృదయ స్పందన ఆగిపోయినప్పుడు అత్యవసరంగా చేసే ప్రాణాలను కాపాడే ప్రక్రియపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. నిమిషానికి 100 నుంచి 120 కుదింపులు ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గులివిండల నాగభూషణం దొర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.